యూట్యూబ్ స్క్రిప్ట్ రైటర్ ఆత్మహత్య

వెంగళరావునగర్, ఏప్రిల్ 10: ఓ యూట్యూబ్ స్క్రిప్ట్ రైటర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని బాపట్లకు చెందిన వంశీ (25) స్నేహితులతో కలిసి జవహర్ నగర్‌లో ఉంటున్నాడు. ఓ యూట్యూబ్‌కు స్క్రిప్ట్ రైటర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో వంశీ మద్యం మత్తులో ఇంటికి వచ్చాడు. ఆత్మ హత్య చేసుకుంటానంటూ గట్టిగా కేకలు వేశాడు. స్నేహితులు ఆయనను బుజ్జగించారు. అనంతరం వంశీ గది ఖాళీ చేసి, తన స్వగ్రామానికి వెళ్లిపోతున్నట్లు చెప్పి బయలుదేరాడు. కొంత సమయం తర్వాత స్నేహితులు గది తలుపు వేసి నిద్ర పోయారు. తెల్లవారుజామున ఇంటికి వచ్చిన మరో స్నేహితుడు సాయి.. భవనం టెర్రస్‌పైకి వెళ్లగా.. వంశీ టవల్‌తో ఓ స్తంభానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుని ఉండటాన్ని గుర్తించాడు. వెంటనే భవన యజమాని మొబీన్‌కు, పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి, మృతదేహాన్ని గాంధీ దవాఖానకు తరలించారు. మృతుడి స్నేహితుడు వినోద్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వంశీ ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

పగతోనే చంపారు

హత్య కేసులో 13 మంది అరెస్టు

వివరాలు వెల్లడించిన బాచుపల్లి పోలీసులు

దుండిగల్, ఏప్రిల్ 10: ప్రగతినగర్‌లో ఈ నెల 8వ తేదీన జరిగిన యువకుడి హత్య కేసులోని నిందితులను బాచుపల్లి పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ హత్యలో మొత్తం 13 మంది పాల్గొనగా.. వీరిలో నలుగురు మైనర్లు, ఓ రౌడీషీటర్ ఉన్నారు. గతేడాది అక్టోబర్ 24న ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన తరుణ్‌రాయ్ హత్యకు ప్రతీకారంగానే ప్రగతినగర్‌లో ఈ హత్య జరిగినట్లు స్పష్టం చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడకు చెందిన తేజాస్ అలియాస్ తేజ అలియాస్ డీల్ (21) కుటుంబం రెండు దశాబ్దాల కిందట నగరానికి వచ్చి, బోరబండలో స్థిరపడింది. తేజ తండ్రి చనిపోయాడు. తల్లి వద్ద ఉంటూ.. చిన్ననాటి నుంచి అవారాగా తిరిగాడు. ఇదిలా ఉండగా.. స్థానికంగా ఉండే షేక్ షరీఫ్, అభిషేక్, తేజు, నాగరాజు, రాహుల్, రాబిన్‌బెన్సి గతేడాది అక్టోబర్ 24న (దసరా పండుగ రోజున) ఎస్ఆర్‌నగర్‌లో జరిగిన తరుణ్‌రాయ్ హత్యకేసులో నిందితులుగా ఉన్నారు. ఇందులో షేక్‌షరీఫ్, తేజు రెండు నెలల కిందట బెయిల్‌పై విడుదలయ్యారు. బీకేగూడలో ఉంటే ప్రాణాలకు ప్రమాదం ఉంటుందని భావించి.. మకాంను నిజాంపేట పరిధిలోని ప్రగతినగర్‌కు మార్చాడు.

తేజు (ఫైల్)

పథకం ప్రకారమే తేజు హత్య..

తరుణ్‌రాయ్‌ను హత్యచేసిన తేజును ఎలాగైనా మట్టుబెట్టాలని తరుణ్‌రాయ్ బంధువు రోహిత్ తన అనుచరులు దినేశ్, తదితరులతో కలిసి పథకం రచించాడు. ఇందుకోసం శివప్ప అనే వ్యక్తిని రంగంలోకి దింపాడు. తేజు చిరునామా తెలుసుకోవడంతోపాటు అతడితో స్నేహంగా ఉండాలని, అవకాశం చిక్కగానే సమాచారమివ్వాలని సూచించారు. దీంతో శివప్ప కొద్ది రోజులుగా తేజుతో స్నేహంగానే ఉంటూ.. ఎప్పటికప్పుడు అతడి సమాచారాన్ని ప్రత్యర్థి వర్గానికి చేరవేస్తున్నాడు. తేజు తల్లి ఐదు రోజుల కిందటే వేములవాడకు వెళ్లింది. ఈ నేపథ్యంలో ఈ నెల 7వ తేదీన రాత్రి 11 గంటల సమయంలో తేజు, మహేశ్, శివప్ప, మహేశ్ కలిసి తేజు ఇంట్లో కూర్చుని మద్యం తాగారు. ఇదే విషయాన్ని శివప్ప ఫోన్ ద్వారా రోహిత్‌కు చెప్పడంతో పాటు వారున్న లోకేషన్‌ను కూడా షేర్ చేశాడు. దీంతో ఆదివారం తెల్లవారు జామున రోహిత్, సమీర్, సిద్దేశ్వర్ నాయక్, గణేశ్, సునీల్, రాహుల్, తిరుమలేశ్, మహేశ్‌తో పాటు మరో ముగ్గురు మైనర్లు బైక్‌లపై ప్రగతినగర్‌కు చేరుకున్నారు. వీరిలో సమీర్, సిద్దేశ్వర్ నాయక్‌తో పాటు ఓ మైనర్ తేజు నివాసముంటున్న ఇంటి కింద కాపు కాస్తుండగా, రోహిత్, దినేశ్, తిరుమల్, రాహుల్, ప్రతీక్, సునీల్, గణేశ్, సంతోష్, శ్రీకర్ పరిసర ప్రాంతాలను గమనిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున (ఏప్రిల్ 8న) 4 గంటల సమయంలో ముందస్తు పథకంలో భాగంగా సిగరేట్ పేరుతో తేజు, మహేశ్‌ను శివప్ప ఇంటిపై నుంచి కిందకు తీసుకువచ్చాడు. అనంతరం శివప్ప.. తేజును తన స్కూటీపై కూర్చోబెట్టుకుని రోడ్డుపైకి వచ్చి.. బైక్‌ను సమీర్ ముందు ఆపాడు. ప్రమాదం పసిగట్టిన తేజు తప్పించుకునేందుకు కొంతదూరం పరిగెత్తాడు. వెంబడించిన సిద్దేశ్వర్ నాయక్, మరో బాలుడు కత్తులతో కడుపులో పొడవగా.. సమీర్ బండరాయితో తేజు తలపై మోదాడు. తేజు కిందపడిపోయాడు. శివప్ప కత్తితో తేజు మెడను నరికి వేయగా.. అక్కడికక్కడే మరణించాడు. తేజు మరణం తర్వాత.. నిందితులు బైక్‌లపై తిరిగి వెళ్తూ.. హత్య జరిగిన చోటుతో పాటు వేర్వేరు ప్రాంతాల్లో బైక్‌లపై తిరిగి వీడియోలు తీసి ఇన్‌స్టాగ్రాంలో పోస్ట్ చేయడం సంచలనం సృష్టించింది.

చాలెంజ్‌గా తీసుకున్నాం..

కాగా, ఈ కేసును చాలెంజ్‌గా తీసుకున్న బాచుపల్లి ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, ఎస్ఐలు మహేశ్, సత్యనారాయణ కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో నిందితులైన 13 మందిని గుర్తించి, రెండు రోజుల్లోనే పట్టుకున్నారు. 13 మంది నిందితుల్లో నలుగురు మైనర్లు ఉన్నారు. వారిని జువైనల్ కోర్టులో హాజరు పరుచగా, మిగతా 9 మంది రోహిత్, సమీర్, సిద్దేశ్వర్ నాయక్, శివప్ప, గణేశ్, సునీల్, రాహుల్, తిరుమలేశ్, మహేశ్‌ను రిమాండ్‌కు తరలించారు. వీరిలో తిరుమలేశ్‌పై బోరబండ పీఎస్‌లో రౌడీషీట్ ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. నిందితుల నుంచి ఆరు సెల్‌ఫోన్‌లు, 4 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. రెండు రోజుల్లోనే ఈ హత్య కేసు మిస్టరీని ఛేదించి, నిందితులను పట్టుకున్న బాచుపల్లి పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడికి బెయిల్

నాంపల్లి కోర్టులు, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ కుమారుడు మహ్మద్ రహీల్ అమేర్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. ఈ మేరకు 14వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కన్నయ్యలాల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజాభవన్ ముందు జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడైన రహీల్‌ను రూ.20 వేల సొంత పూచీకత్తుపై ఇద్దరి జమానత్‌ను కోర్టుకు సమర్పించాలని, కోర్టు అనుమతి లేనిదే దేశాన్ని వీడరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు విచారణాధికారికి సహకరించాలని కోర్టు సూచించింది. ఏడురోజుల పోలీసు కస్టడీకి అప్పగించాలని దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. సాక్షులు నిందితుడిని గుర్తించే టెస్ట్ ఆఫ్ ఐడెంటిఫికేషన్ పరేడ్ ప్రక్రియనూ కోర్టు తిరస్కరించింది. కేసులో 11,12వ నిందితులైన పంజాగుట్ట, బోధన్‌కు చెందిన ఇద్దరు పోలీస్ అధికారులను రిమాండ్‌కు తరలించలేదని ఉత్తర్వుల్లో పేర్కొన్నది.

సైబరాబాద్‌లో డ్రగ్ పట్టివేత.. ఐదుగురి అరెస్టు

సిటీబ్యూరో, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): డ్రగ్స్ విక్రయిస్తున్న ఐదుగురిని సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 11కు చెందిన వెన్ను నాగరాజు(26) గోవాలోని కండోలియం బీచ్, లార్డ్స్ ఆఫ్ డ్రింక్స్ పబ్‌లో పనిచేయడమే కాకుండా.. ఈవెంట్లు సైతం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఓ పబ్‌లో చెఫ్‌గా పనిచేసే ప్రదీప్‌తో పరిచయం ఏర్పడింది. ప్రదీప్ చెఫ్‌తో పాటు డ్రగ్ వ్యాపారం కూడా చేస్తాడు. నాగరాజు ఇటీవల గోవాలో ప్రదీప్ వద్ద నుంచి గ్రాము రూ.4,000 చొప్పున 4 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను కొనుగోలు చేసి, నగరానికి తీసుకువచ్చాడు. ఇక్కడ తన స్నేహితులకు విక్రయించేందుకు యత్నించగా.. సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు నిందితుడిని బుధవారం సనత్‌నగర్ బస్టాండ్‌లో పట్టుకున్నారు. అతడితో పాటు అతడి స్నేహితులు సోహెచ్.గణేశ్, భరత్, సాయి దిలీప్, గౌతంను సైతం అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ. 68వేల విలువజేసే 4 గ్రాముల ఎండీఎంతో పాటు 5 గ్రాముల గంజాయి, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసును సనత్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

మహోన్నత వ్యక్తి రాజీవ్‌రతన్

డీజీపీ రవిగుప్తా

హైదరాబాద్, ఏప్రిల్10 (నమస్తే తెలంగాణ): విజిలెన్స్ డీజీ రాజీవ్‌రతన్ తమకు సహోద్యోగి మాత్రమేకాదని, మహోన్నత మైన వ్యక్తని, ఆత్మవిశ్వాసానికి ప్రతీకని తెలంగాణ రాష్ట్ర డీజీపీ రవిగుప్తా కొనియాడారు. డీజీ రాజీవ్‌రతన్ హఠాన్మరణం తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీ నుంచి నేషనల్ పోలీస్ అకాడమీ వరకు రాజీవ్ ప్రయాణం క్రమశిక్షణతో కొనసాగిందని గుర్తు చేసుకున్నారు. సంకల్పశక్తికి ప్రతీకని, స్క్వాష్, వెయిట్ లిఫ్టింగ్, జిమ్, నిరాయుధ పోరాటంలో వర్క్ అవుట్లేనని వివరించారు. నేషనల్ పోలీస్ అకాడమీలో ఆయన శిక్షణ అందరికంటే భిన్నమని, ఎక్కడా రాజీపడని వ్యక్తిత్వమని కొనియాడారు. రాజీవ్ హఠాన్మరణం తీరని లోటని వాపోయారు. రాజీవ్‌తో పంచుకున్న క్షణాలు, నేర్చుకున్న పాఠాలు తమ హృదయాల్లో ఎప్పటికీ నిలిచి ఉంటాయని వివరించారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

దుండిగల్, ఏప్రిల్10: నిర్మాణరంగ కూలీలకు గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తున్న ముగ్గురిని మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.33,750 విలువజేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశాకు చెందిన రంజన్‌దాస్ (26), కేశవ్ కౌర్(28), గంగా(31) ఉపాధి కోసం వచ్చి, బౌరంపేట పరిసర ప్రాంతాల్లోని నిర్మాణ రంగ సంస్థల్లో కూలీలుగా పని చేస్తున్నారు. కూలీ డబ్బులతో జీవనం సాగడం కష్టంగా మారడంతో కొన్ని రోజులుగా ఒడిశాకు చెందిన రావణ్ (31) ద్వారా తక్కువ ధరకు గంజాయి తీసుకువచ్చి.. ఇక్కడ తమతో పనిచేసే కూలీలకు విక్రయిస్తున్నారు. మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు నిఘా పెట్టారు. బుధవారం ఉదయం బౌరంపేటలోని ఖాళీ ప్రదేశంలో రంజన్ దాస్, కేశవ్ కౌర్, గంగా అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం బయటపడింది. దీంతో నిందితుల నుంయి రూ. 33,750ల విలువజేసే 1.35 కిలోల గంజాయి, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అనంతరం నిందితులను దుండిగల్ పోలీసులకు అప్పగించగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరో నిందితుడు రావణ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదం.. మృతి

జీడిమెట్ల, ఏప్రిల్ 10: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మరణించాడు. జీడిమెట్ల పోలీసుల కథనం ప్రకారం.. సూరారం కాలనీకి చెందిన సంపత్‌కుమార్ (35) వెల్డర్. బుధవారం మధ్యాహ్నం అతడు తన ద్విచక్ర వాహనంపై జీడిమెట్ల ఫేజ్- 3 నుంచి జైరాజ్ స్టీల్ పరిశ్రమ వైపు వెళ్తున్నాడు. ఎదురుగా రాంగ్ రూట్లో వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సంపత్‌కుమార్ పైనుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం విక్రయదారుడి అరెస్టు

14 మద్యం బాటిళ్లు, రూ.1,800 నగదు సీజ్

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 10: మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని నారాయణగూడ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై శిరీష కథనం ప్రకారం.. గాంధీ కుటీర్ బస్తీ నివాసి మహేశ్ కుమార్ (35) కొంత కాలంగా వివిధ వైన్స్ షాపుల నుంచి మద్యం కొనుగోలు చేసి, ఎక్సైజ్ శాఖ నిబంధనలను ఉల్లంఘిస్తూ విక్రయిస్తున్నాడు. బుధవారం ఉదయం నారాయణగూడ ఫ్లై ఓవర్, శివాజీనగర్ సమీపంలో ఉన్న బస్టాప్ వద్ద మద్యం బాటిళ్లు పెట్టి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వెళ్లి తనిఖీ చేసి, 14 మద్యం బాటిళ్లు, రూ.1,800 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న మహేశ్ కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రెండు కుటుంబాలపై దాడి..

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

మన్సూరాబాద్, ఏప్రిల్ 10: ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న రెండు కుటుంబాలపై దాడికి పాల్పడి, చంపుతామంటూ బెదిరించిన వ్యక్తులపై ఎల్బీనగర్ పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లాకు చెందిన యాదయ్యగౌడ్ కుటుంబం హస్తినాపురంలోని పిర్జీసాయినగర్ కాలనీలో ఓ ఇంట్లో 3 నెలలుగా అద్దెకు ఉంటున్నారు. ఆ ఇంట్లో అద్దెకు దిగినప్పటి నుంచి ఇంటి యజమాని, యాదయ్యగౌడ్ మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఇంటి యజమాని ఇల్లు ఖాళీ చేయాలని కోరాడు. ఈ ఇంటి పై అంతస్తులో ఉంటున్న భరత్‌కుమార్, సైదాచారి కారణంగానే ఇంటి యజమాని తనను ఇల్లు ఖాళీ చేయమని చెప్పాడని భావించిన యాదయ్య వారి కుటుంబాలపై కక్ష పెంచుకున్నాడు. సోమవారం రాత్రి సమయంలో యాదయ్య తన స్నేహితుడైన శేఖర్‌రెడ్డితో పాటు మరి కొందరితో కలిసి సమీపంలో ఉండే భరత్‌కుమార్ ఇంటర్‌నెట్ సెంటర్‌కు వెళ్లాడు. అక్కడ కంప్యూటర్లను ధ్వంసం చేయడంతో పాటు కులం పేరుతో తిట్టాడు. తిరిగి మంగళవారం ఉదయం 15 మందిని తీసుకొచ్చిన యాదయ్య.. సాయంత్రం వరకు అక్కడే మద్యం సేవిస్తూ రెండు కుటుంబాలను చంపుతామంటూ వీరంగం సృష్టించాడు. పై పోర్షన్‌లో ఉన్న రెండు కుటుంబాల్లోని వ్యక్తులు ఎవరైనా కిందికి వస్తే చంపేస్తామని నానా రభస చేశారు. అంతటితో ఆగకుండా పై పోర్షన్‌కు వెళ్లి తలుపులు పగులగొట్టే ప్రయత్నం చేశారు. స్థానికులిచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకునే లోపై యాదయ్య, అతడి మిత్రులు పారిపోయారు. కులం పేరుతో దూషించి, చంపుతామంటూ బెదిరించిన యాదయ్యగౌడ్, అతడి భార్య అరుణ, శేఖర్‌రెడ్డితో పాటు ఇతరులపై ఎల్బీనగర్ పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

పూలే జయంతి ఘనంగా నిర్వహించాలి

బీసీ శ్రేణులకు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్10 (నమస్తే తెలంగాణ): అణగారిన వర్గాల జీవితాల్లో అక్షరాలు దిద్దించి వెలుగులు నింపిన మహాత్మా జ్యోతిబాపూలే 198వ జయంతి ఉత్సవాలను నేడు(గురువారం) రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ సంస్థ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రస్థాయి ఉత్సవాలను హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో ఉన్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరవుతారని తెలిపారు. అన్ని బీసీ సంఘాల బాధ్యులు, కుల సంఘాల నేతలు, విద్యార్థి యువజన మహిళా మేధావులు పూలే జయంతి వేడుకల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు

సనాతన ధర్మమే ప్రధాన లక్ష్యం

సిటీబ్యూరో, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): ప్రపంచానికి హిందూ ధర్మ గొప్పతనాన్ని చాటిచెబుతూ, అయోధ్య వేదికగా ప్రాణప్రతిష్ఠ చేసిన రామ్‌లల్లాతో దేశంలో స్వర్ణయుగం మొదలైందని స్వామి గోవింద్ దేవ్‌గిరి జీ మహారాజ్ అన్నారు. చైత్రనవరాత్రుల సందర్భంగా అయోధ్యలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ కథను ఆయన ప్రారంభించారు. పతంజలి యోగాపీఠంలోని ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన వేదికపై హిందూ ధర్మ పరిరక్షణలో ఛత్రపతి చూపిన తెగువ ఎప్పటికీ చిరస్మరణీయమేనన్నారు. బ్రిటిష్ పాలనలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలతోపాటు విద్యావిధానాలన్నీ భ్రష్టుపట్టాయని, వీటిని పునర్జీవం పోయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సనాతన ధర్మం గొప్పతనాన్ని భావితరాలకు అందించడమే లక్ష్యంగా వేదపరంపర కొనసాగించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఛత్రపతి చూపిన మార్గదర్శనంలో అఖండ్ భారత స్థాపనయే ప్రధాన అజెండాగా సనాతన ధర్మంతో ముందుకు సాగాలని స్వామి గోవింద్ దేవ్‌గిరి జీ మహారాజ్ సూచించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు స్వామీ రాందేవ్, పతంజలి యోగాపీఠ్ ముఖ్యులు, శాఖాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గొలుసు దొంగ అరెస్టు

మల్కాజిగిరి, ఏప్రిల్ 10: నీళ్లు కావాలని వృద్ధురాలిని అడిగి.. ఆమె గొంతు పిసికి మెడలోని బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన యువకుడిని అల్వాల్ పోలీసులు అరెస్టు చేశారు. డీఐ రాజేందర్ గౌడ్ కథనం ప్రకారం.. మచ్చ బొల్లారం అంజనాపురి కాలనీకి చెందిన సుకునమ్మ ఇంటికి మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియని ఓ వ్యక్తి వచ్చి గొంతు ఎండిపోతోంది.. తాగేందుకు నీళ్లు ఇవ్వమని అడిగాడు. నీళ్లు లేవంటూ ఆమె చెప్పి.. ఇంట్లోకి వెళ్తూ తలుపులు మూస్తుండగా.. అతడు బలవంతంగా తలుపులు నెట్టి ఇంట్లోకి ప్రవేశించాడు. వృద్ధురాలి గొంతు నొక్కి ఊపిరి ఆడకుండా చేశాడు. ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసుతోపాటు చెవి రింగులను తీసుకుని పారిపోయాడు. వృద్ధురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి నిందితుడిని గుర్తించారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన సాయితేజ (20) ఎలక్ట్రిషన్. బతుకు దెరువు కోసం నాలుగు నెలల కిందట నగరానికి వచ్చి అంజనాపురికాలనీలో స్నేహితులతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. మంగళవారం రాత్రి అతడు అల్వాల్ పరిధిలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడి పేరుతో సాయితేజ అని తెలిపాడు. అతడి వద్ద నుంచి బంగారు గొలుసుతో పాటు చెవి రింగులను స్వాధీనం చేసుకున్నారు. సాయితేజను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

సికింద్రాబాద్- కొల్లం మధ్య 22 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): వేసవి నేపథ్యంలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా పలు రైల్వేస్టేషన్ల పరిధిలో మొత్తం 26 ప్రత్యేక రైళ్లను అధికారులు నడిపిస్తున్నారు. సికింద్రాబాద్- కొల్లం రైల్వేస్టేషన్ల మధ్య ఈ నెల 17 నుంచి జూన్ 28వ తేదీ వరకు 22 ప్రత్యేక రైళ్ల రాకపోకలు ఉంటాయని రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. సికింద్రాబాద్- సత్రగాచి స్టేషన్ల మధ్య మరో నాలుగు ప్రత్యేక రైళ్లు ఉంటాయని, ఇవి ఈ నెల 19 నుంచి జూన్ 29వ తేదీ వరకు రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు. ఈ మేరకు షెడ్యూల్ విడుదల చేశారు.

రూ.2.02 కోట్లు ఏటీఎం నగదుగా గుర్తింపు

మాదాపూర్, ఏప్రిల్ 10: మాదాపూర్‌లోని ఓ వాహనంలో రూ.2.02 కోట్ల నగదును బుధవారం తరలిస్తుండగా పోలీసులు గుర్తించారు. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ కథనం ప్రకారం.. మాదాపూర్‌లోని కాకతీయ హిల్స్ సమీపంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో యాక్సిస్ బ్యాంకుకు చెందిన ఓ వాహనంలో రూ.2.02 కోట్ల నగదును బేగంపేట నుంచి హైటెక్ సిటీ వైపు తరలిస్తుండగా పోలీసులు గుర్తించారు. ఇది ఎన్నికల కొరకు తరలించే డబ్బు కాదని, ఏటీఎంలో నగదును నింపేందుకు తరలిస్తున్నట్టుగా గుర్తించి, ఆ వాహనాన్ని వదిలివేశారు.

తనిఖీలు ముమ్మరం

రూ.12.97 కోట్ల నగదు సీజ్

సిటీబ్యూరో, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు గ్రేటర్ వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.12.97 కోట్ల మేర నగదును ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. రూ. కోటి 86 లక్షల విలువజేసే ఇతర వస్తువులు, 19.82 లీటర్ల అక్రమ మద్యాన్ని పట్టుకున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. 146 కేసులు నమోదు చేసి, 141 మందిని అరెస్టు చేశామన్నారు. నగదు, ఇతర వస్తువులపై 296 ఫిర్యాదులు రాగా.. పరిశీలించి పరిష్కరించామన్నారు. తాజాగా.. గడిచిన 24 గంటల వ్యవధిలో రూ.10.17 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు రోనాల్డ్ రాస్ పేర్కొన్నారు.

₹2 కోట్ల నకిలీ సిగరెట్స్ స్మగ్లింగ్

స్వాధీనం చేసుకున్న రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు

గగన్‌పహాడ్ లారీ పార్కింగ్ ఏరియాలో స్టోర్

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 10: డిటర్జెంట్ పౌడర్ పేరుతో వివిధ బ్రాండ్స్ నకిలీ సిగరెట్స్ స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ముఠాను రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. బుధవారం ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి సీఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం పాట్నా మీదుగా హైదరాబాద్‌కు ఓ భారీ కంటైనర్‌లో సిగరెట్స్ తీసుకువచ్చి గగన్‌పహాడ్ లారీ పార్కింగ్ ఏరియాలో ఉంచారు. ఈ క్రమంలో బుధవారం పోలీసులు తనిఖీలు చేపట్టగా నకిలీ సిగరెట్స్‌ను గుర్తించారు. బీహార్‌కు చెందిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేయడంతో పాటు నిందితుల నుంచి రూ. 2 కోట్లకు పైగా విలువైన నకిలీ సిగరెట్స్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. డెలివరీ అడ్రస్ హైదరాబాద్ ముషీరాబాద్‌లోని శ్రీరామ్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో ఉన్నదని పేర్కొన్నారు. పట్టుబడిన వారిలో బీహార్‌కు చెందిన రవికాంత్ కుమార్, మహ్మద్ షజాద్, ముబారిక్ ఖాన్, సయ్యద్ ఇలియాసుద్దీన్, సుభాష్ అలియాస్ రాజు ఉన్నారు. వీరు సిగరెట్లను హైదరాబాద్‌లోని కిషన్‌బాగ్‌కు చెందిన రేహాన్‌ఖాన్‌కు అప్పగిస్తారని, ప్రస్తుతం రేహాన్‌ఖాన్ పరారీలో ఉన్నట్టు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

నకిలీ సిగరెట్స్ స్వాధీనం చేసుకున్న పోలీసులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PACKERS & MOVERS

★Sri Sai Packers & Movers Local and all over India, Resonable Price. Head Office Nacharam: 27176927, Ameerpet: 9866379391, DSNR: 9666993927, KKP: 9949513929, MP: 9848263927, ECIL: 9666983927. NT-328107

PEST CONTROL



★చెదలు, బొద్దింకలు నివారణ: న్యూ కన్‌స్ట్రక్షన్ ట్రీట్‌మెంట్ 10 సంవత్సరాల గ్యారెంటీ మరియు శానిటైజర్ స్ప్రే కొరకు సంప్రా: 9392468282, 8333030227. NT-327882

PLOT FOR SALE



★బీబీనగర్ to అనంతారం, కీసర & ECIL 100 ఫీట్ రోడ్‌కు LRSతో రెసిడెన్షియల్ ప్లాట్లు నియర్ AIIMS & RRR గ।। కే।। 4,000/- మాత్రమే. స్పా।।రి।।: 9032677876. NT-320389

★న్యూ గేటెడ్ కమ్యూనిటీ ఫార్మ్‌హౌస్ వెంచర్ లాంచింగ్ విజయవాడ హైవే @ నార్కెట్‌పల్లి దగ్గర ఆహ్లాదకరమైన వాతావరణంలో స్విమ్మింగ్‌పూల్, క్లబ్‌